క్లుప్తంగా

కనుల పండువగా సహస్రదీపాలంకరణ సేవ



బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో శనివారం అమ్మవారికి సహస్ర దీపాలంకరణ సేవను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని సుందరంగా ముస్తాబు చేసి పల్లకీలో ఉంచి ఊరేగించారు.

భవన నిర్మాణ పనుల అడ్డగింత

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని తొలగించి రూ.13 లక్షలతో నూతన భవనం నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సిమెంట్ పనులు జరుగుతున్నాయి. వారం రోజులకు పైగా సంబంధిత కంట్రాక్టర్ నీరు పెట్టకపోవడంతో సిమెంట్ పెచ్చులూడటంతో గ్రామస్తులు శనివారం పనులను అడ్డుకున్నారు. అధికారులు స్పందించి గ్రంథాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతగా చేపట్టే విధంగా చూడాలని కోరారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

బేతంచెర్ల: హెచ్ఐవీ ఎయిడ్స్ అవగాహన రాహిత్యంతోనే ఎక్కువగా వస్తుందని వ్యాధిపై అందరూ అప్రమత్తంగా ఉండాలని హ్యాండ్స్ సేవా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ మధుకుమార్ అన్నారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సహకారంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఇన్ఫర్మేషన్ స్టాల్ ద్వారా ప్రజలకు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేసి, హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. హెచ్ఐవీ వచ్చిన వారికి ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా నిర్ధారణ పరీక్షలతో పాటు మందులను పంపిణీ చేస్తారన్నారు.

స్వీపర్లకు దుస్తుల పంపిణీ

డోన్: సెమీ క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో పని చేసే స్వీపర్లకు వైద్యురాలు జయలక్ష్మి శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ప్రార్థన సమయం ఆధ్వర్యంలో తాడిపత్రికి చెందిన అశోక్‌కుమార్ ఆర్థిక సహాయంతో దుస్తులు పంపిణీ చేసినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్ మృతి

డోన్ టౌన్: పట్టణానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎస్ఎం బాషా (57) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన 27 ఏళ్ల సర్వీసులో మూడుసార్లు ఉత్తమ డ్రైవరుగా అవార్డు అందుకున్నారు. విషయం తెలుసుకున్న ఆర్టీసీ అధికారులు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియల కోసం రూ.15 వేల సాయం చేశారు.

బీపీ శేషారెడ్డి సేవలు ఆదర్శం

బేతంచెర్ల: మండల కేంద్రంలో రావుబహదూర్ బీపీ శేషారెడ్డి విద్య, వైద్య, ఆధ్యాత్మిక రంగాలకు తోడ్పాటును అందించి ఆదర్శంగా నిలిచారని పలువురు అన్నారు. శనివారం ఆయన వర్థంతి సందర్భంగా స్థానిక శేషారెడ్డి ఉన్నత పాఠశాలలోని విగ్రహానికి నివాళులర్పించారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సేవానిరతికి సత్కారం

డోన్: ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడుతున్నారో అక్కడ దేవతలు సంచరిస్తుంటారని కళారత్న, శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. స్థానిక గాయత్రీ పీఠంలో శనివారం దత్త జయంతి సందర్భంగా సామాజిక, ఆర్థిక సేవా రంగాల్లో విశేష కృషి చేసిన ఆర్టీసీ ఉద్యోగి శాంతిని ఘనంగా సత్కరించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

డోన్ టౌన్: ట్రూఅప్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారం మోపడం సిగ్గుచేటని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపుదలను నిరసిస్తూ శనివారం సీపీఎం నాయకులు పట్టణంలోని సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. తాము అధికారంలోకి వస్తే ఐదేళ్ల పాటు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే చార్జీలు పెంచడం దారుణమన్నారు.

వివాహ వేడుకలో బుగ్గన



వధూవరులతో మాజీ మంత్రి బుగ్గన

బేతంచెర్ల: పట్టణంలోని అమ్మవారిశాలలో సముద్రాల మద్దిలేటి స్వామి, సుప్రజ దంపతుల కుమార్తె సంహిత, శ్రీనివాస్‌ల వివాహం శనివారం జరిగింది. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పట్టణానికి చెందిన వీరభద్రారెడ్డి, సుజాతరెడ్డి దంపతుల కుమార్తె సాయిప్రీతి వివాహానికి హాజరయ్యారు. వారి వెంట నాయకులు బాబుల్‌రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజావలి, ఖాజా, రామచంద్రుడు, గూని నాగరాజు ఉన్నారు.

శీతాకాలంలో వెచ్చని నేస్తాలు

- పెరుగుతున్న చలి తీవ్రత
- ఉన్ని దుస్తులకు డిమాండ్
- మహిళలు, చిన్నారుల కోసం ప్రత్యేక దుస్తులు
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి గ్రామాల్లో దుకాణాలు



కోవెలకుంట్లలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణం

సండే స్పెషల్

అవుకు: చలిపులి చంపుతోంది. బారెడు పొద్దెక్కినా మంచంపై నుంచి దిగటానికి మనసొప్పని పరిస్థితి. వెచ్చని రగ్గులో ముసుగుతన్ని నిద్రిస్తే ఆ సుఖమే వేరు. ఇలాంటి శీతాకాలంలో తప్పనిసరి ప్రయాణాలు, రోజువారి విధులకు ఉదయాన్నే ఇళ్ల నుంచి బయలుదేరే వారి పరిస్థితి ఇబ్బందే కదా. ఆ ఇబ్బందులను తప్పించేందుకే చలి నేస్తాలు ఊరూరా చేరుకున్నాయి. మధ్యప్రదేశ్, కోల్‌కతా నుంచి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా వ్యాపారులు వివిధ రకాల ఉన్ని దుస్తులు ఇక్కడికి తెచ్చి తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చలి తీవ్రత పెరుగుతుండడంతో ఉన్ని దుస్తుల కొనుగోళ్లు ఊపందుకున్నాయి. దీపావళి నుంచి సాయంత్రం ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఇప్పటికే రాత్రి పూట 17 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగలంతా ఎండ ఉన్నప్పటికీ, సాయంత్రానికి వాతావరణం బాగా చల్లబడుతోంది. ఈ నేపథ్యంలో చలి నుంచి ఉపశమనం పొందడానికి బనగానపల్లె నియోజకవర్గ పరిసర ప్రాంతాల ప్రజలు ఉన్ని దుస్తుల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రస్తుతం ఫ్యాషన్ ట్రెండ్‌ను అనుసరిస్తూ మహిళలు, పిల్లల కోసం వెరైటీ డిజైన్లు అందుబాటులో ఉన్నాయి. జర్కిన్లు, మఫ్లర్‌లు, క్యాప్‌లు, బ్లాంకెట్‌ల అమ్మకాలు ఊపందుకున్నాయి. సాధారణ స్వెటర్లపై ప్రజల్లో అంతగా ఆసక్తి ఉండడం లేదు. దీంతో మారుతున్న కాలానికి అనుగుణంగా సరి కొత్త డిజైన్లతో స్వెటర్లు, మంకీ క్యాప్‌లు, స్కార్ఫ్‌లు, మాస్కులు, జర్కిన్లు, టూ ఇన్ వన్‌గా ఉపయోగపడే జర్కిన్లు, చేతి గ్లౌస్‌లు, సాక్స్‌లు, రగ్గులు, కార్పెట్లు, బెడ్‌షీట్లు కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

అందుబాటు ధరల్లోనే..

ప్రధాన రహదారుల పక్కనే ఉన్ని దుస్తుల అమ్మకాల కోసం మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన వ్యాపారులు తాత్కాలిక దుకాణాలను ఏర్పాటు చేశారు. పిల్లల స్వెటర్లు రూ.200 నుంచి రూ.700 వరకు, క్యాప్‌లు రూ.60 నుంచి రూ.250 వరకు పలు డిజైన్లలో లభిస్తున్నాయి. ఆరేళ్ల నుంచి పదేళ్ల లోపు పిల్లలకు స్వెటర్లు రూ.350 నుంచి రూ.1200 వరకు లభిస్తుండగా, పదేళ్లకు పైబడిన వారి స్వెటర్లు రూ.350 నుంచి రూ.1500 వరకు అందుబాటులో ఉన్నాయి. పెద్దలకు స్వెటర్లు రూ.500 నుంచి రూ.2000 వరకు ఉండగా, జర్కిన్‌లు డిజైన్, క్వాలిటీని బట్టి రూ.600 నుంచి రూ.2వేల వరకు లభిస్తున్నాయి. మఫ్లర్లు రూ.70 నుంచి రూ.150 వరకు, మంకీ క్యాప్‌లు రూ.80 నుంచి రూ.200 వరకు, శాలువాలు రూ.150 నుచి రూ.250 వరకు, బెడ్‌షీట్లు రూ.500 నుంచి రూ.2వేల వరకు అమ్ముతున్నారు.

చలిలో తిరిగేటప్పుడు రక్షణ తప్పనిసరి

చలిగాలి నుంచి రక్షన పొందాలంటే కచ్చితంగా ఉన్ని దుస్తులు ధరించాల్సిందే. శరిరంలోని వేడి బయటకు వెళ్లకుండా ఉండేందుకు ఉన్ని దుస్తులు వేసుకోక తప్పదు. రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాత్రి, తెల్లవారుజామున రోడ్లపై ఎలాంటి రక్షణ లేకుండా తిరిగితే జబ్బులు, దగ్గుకు గురవుతారని వైద్యులు సూచిస్తున్నారు. రాత్రి సమయంలో కొంత మంది ఉన్ని దుస్తులు ధరించి నిద్రపోతారు. అది అంత మంచిది కాదని డాక్టర్లు సూచిస్తున్నారు. వీతాకాలంలో చలిలో ఎక్కువగా తిరగడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదని అంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చలిగాలిలో తిరగాల్సి వస్తే ఉన్ని స్వెటర్లు ధరించాలి. చెవుల్లోకి గాలి వెళ్లకుండా జాగ్రత్త పడాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

మూడు నెలల పాటు విక్రయాలు



ఏటా మూడు నెలల పాటు బనగానపల్లె ఏరియాలో ఉన్ని దుస్తులను అమ్ముతూ ఉపాధి పొందుతున్నాం. నవంబర్ రెండో వారం నుంచి అమ్మకాలు ప్రారంభించాం. చలి తీవ్రత పెరగడంతో గిరాకీ ఉంటోంది. స్థానికుల నుంచి ప్రోత్సాహం లభిస్తోంది. హోల్ సేల్ ధరలకే అన్ని రకాల డిజైన్ల ఉన్ని దుస్తులు విక్రయిస్తున్నాం. –విక్రమ్, వ్యాపారి, మధ్యప్రదేశ్

ఆన్‌లైన్ షాపింగ్‌తో తగ్గిన విక్రయాలు



కుటుంబం గడవాలంటే ఉన్ని దుస్తుల అమ్మకాలే మాకు ఆధారం. ఆన్‌లైన్ షాపింగ్‌తో ఈ ఏడాది వ్యాపారాలకు గిరాకీ తగ్గింది. ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ ఉండడంతో ఆన్‌లైన్ ధరలతో మా సరుకు పోల్చుకుంటున్నారు. నాణ్యత తదితర అంశాలు పట్టించుకోవడం లేదు. కొంతమేరా అమ్మకాలు తగ్గుతున్నాయి.

–భజే సింగ్, వ్యాపారి, మధ్యప్రదేశ్

బనగానపల్లెలో 329 కేసుల పరిష్కారం





బనగానపల్లె: కేసులను పరిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ జడ్జి ఏసురత్నం, కోవెలకుంట్లలో న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్

బనగానపల్లె రూరల్: రాజీ మార్గంతో కేసుల పరిష్కారం ఉత్తమమని బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి ఎం.ఏసురత్నం అన్నారు. శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 329 కేసులను పరిష్కరించారు. ఇందులో క్రిమినల్ 58, అడ్మిషన్-47, సివిల్ -5, చెక్‌బౌన్స్ -2, డీవీసీ -2, ఎంసీ-2, ఎక్సైజ్ -12, ఎస్టీసీ కేసులు 201 పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో ప్రకాష్‌రెడ్డి న్యాయవాదులు రఘురామిరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, అల్లావుద్దీన్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 265 కేసులకు పరిష్కారం

కోవెలకుంట్ల: దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి రాజీయే రాజమార్గమని న్యాయమూర్తి అబ్దుల్ రెహమాన్ అన్నారు. కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీ చేసుకున్న 47 సీసీ కేసులు, 211 ఎస్టీసీ, 7 సివిల్ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీపీ విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు తిరుపాలు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు, కోశాధికారి నాగేషు, న్యాయవాదులు తిరుపతయ్య, మనోహర్‌రెడ్డి, చంద్రుడు పాల్గొన్నారు.



కేసులను విచారిస్తున్న జడ్జి తంగమణి

లోక్ అదాలత్‌కు విశేష స్పందన

డోన్ టౌన్: స్థానిక కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి విశేష స్పందన లభించింది. మొత్తం 419 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతి తెలిపారు. ఇందులో ఐపీసీ 119, ఎస్టీసీ 275, ఓఎస్ 11, ఎక్సైజ్ 6, ఈపీ 5, పీఎల్ 3 కేసుల కక్షిదారులు రాజీకావడంతో పరిష్కరించినట్లు న్యాయమూర్తి తెలిపారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యం అన్నారు.

సాగునీటి సంఘం ఎన్నికలో హైడ్రామా

- పోలీసులను అడ్డుపెట్టుకుని ఏకగ్రీవం చేసుకున్న టీడీపీ



కొలిమిగుండ్ల: ఎన్నికల తీరును తప్పుబడుతున్న రైతులు

కొలిమిగుండ్ల: హనుమంతుగుండం పెద్ద చెరువు సాగునీటి సంఘం ఎన్నికల్లో శనివారం హైడ్రామా చోటు చేసుకుంది. అధికారంలో ఉండి ఓడిపోతే చెడ్డ పేరు, అవమానం ఎదుర్కొవాల్సి వస్తుందని టీడీపీ నాయకులు కుట్రకు తెరలేపారు. ఎలాగైనా దక్కించుకోవాలనే దురుద్దేశంతో పోలీసులు, ఎన్నికల సిబ్బందిని అడ్డుపెట్టుకుని అనుకున్నది సాధించారు. ఉదయం 8 గంటల నుంచే రైతులు ప్రాథమిక పాఠశాలలో జరిగే పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. పోలింగ్‌కు ఇంకా సమయం ఉందని, టీసీ సభ్యుల నామినేషన్‌ల తర్వాత ఓటర్లను లోపలికి పిలుస్తామని ఇలా పలు రకాల కారణాలు చూపి అక్కడికి రాకుండా చూశారు. చివరకు మధ్యాహ్నం 12 గంటల సమయంలో నామినేషన్ పత్రాలు పరిశీలించారు. టీడీపీ తరపున ఆరుగురు సభ్యుల నామినేషన్‌లు బాగున్నాయని, ఇతరులు దాఖలు చేసిన ఏడు నామినేషన్లకు నోడ్యూ సర్టిఫికెట్ లేదనే నెపంతో తిరస్కరించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించి హైడ్రామాకు తెరదించారు. సాగునీటి సంఘం ఎన్నికలో ఓడిపోతామని ముందే తెలుసుకుని టీడీపీ నాయకులు పోలీసులు, అధికారులతో కలిసి కుట్రకు పాల్పడ్డారని గ్రామస్తులు ఆరోపించారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా గ్రామాల పరిధిలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఎస్సార్బీసీకి సంబంధించి జోళదరాశి, గుళ్లదూర్తి, బిజనవేముల, సౌదరదిన్నె గ్రామాల్లో, కేసీ కెనాల్‌కు సంబంధించి కలుగొట్ల, రేవనూరు గ్రామాల పరిధిలో ఆరు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఆయా సంఘాల అధ్యక్షులుగా మబ్బు సుధాకర్, అక్కల సీతారామరెడ్డి, అవుకు రాధాకృష్ణమూర్తి, చిలుకూరి రాఘవరెడ్డి, దోసకాయల గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి నరసింహారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

- **డోన్ రూరల్:** మండలంలోని వెంకటాపురం, ఉడుములపాడు గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించారు. వెంకటాపురం తుమ్మల చెరువుకు చైర్మన్‌గా గోళ్ల పెరుగు శ్రీనివాసులు, వైస్ చైర్మన్‌గా గోవింద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉడుములపాడులో చైర్మన్‌గా మదాసు స్వర్ణలత, వైస్ చైర్మన్‌గా గౌతమిలను ఎన్నుకున్నారు.
- **బేతంచెర్ల:** మండల పరిధిలోని గోర్లగుట్ట సాగునీటి సంఘం డైరెక్టర్లుగా లింగాల పద్మనాభుడు, ఆల నాగిరెడ్డి, ఆదిలక్ష్మమ్మ, బొల్లవరం సుబ్బలక్ష్మమ్మ, పెద్ది సావిత్రి, రాజమ్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఫజుల్ రహిమాన్, తహసీల్దార్ ప్రకాశ్‌బాబు తెలిపారు. చైర్మన్‌గా లింగాల పద్మనాభుడు, వైస్ చైర్మన్‌గా పెద్ది సావిత్రి ఎన్నికయ్యారు.
- **అవుకు:** మండలంలో ఎనిమిది మేజర్ ట్యాంక్‌లు, గుండ్ల సింగవరం, అవుకు, శివవరం, చెన్నంపల్లె, చనుగొండ్ల, పాలేరు, తిమ్మరాజు చెరువులు ఉన్నాయి. అలాగే ఐదు మైనర్ ట్యాంక్‌లు ఉన్నాయి. అన్ని చోట్ల అభ్యర్థులు ఏకగ్రీవం అయ్యారని తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి తెలిపారు.
- **సంజామల:** మండలంలో పది మేజర్ నీటి సంఘాలు, ఆరు మైనర్ నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు తహసీల్దార్ అనిల్ కుమార్ తెలిపారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు తహసీల్దార్ డిక్లేరేషన్‌లను అందజేశారు.



డోన్: స్వర్ణలతకు డిక్లరేషన్ అందజేస్తున్న తహసీల్దార్

- **బనగానపల్లె:** ఎస్సార్బీసీ ఆయకట్టు పరిధిలోని 13 కాల్వలకు తొమ్మిది చెరువులకు అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు.
- **ప్యాపిలి:** మండల పరిధిలోని ఏనుగుమర్రి, ఊటకొండ, వెంగళాంపల్లి సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఆయా సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవమైనట్లు తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కాశీనాయన ఆరాధనోత్సవాలు

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్ల గ్రామంలో వెలసిన కాశీనాయన ఆశ్రమంలో 29వ ఆరాధనోత్సవాలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆశ్రమంలోని వివిధ ఆలయాల్లో కలశస్థాపన, సకల దేవతల హోమం, పూర్ణాహుతి, అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆరాధనోత్సవాలకు సంజామల, కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల మండలాలతోపాటు అనంతపురం, వైఎస్సార్ జిల్లాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం జ్యోతి దర్శనంతో భక్తులు పునీతులయ్యారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కోవెలకుంట్ల సీఐ హనుమంతునాయక్, రేవనూరు ఎస్ఐ భూపాలుడు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా కాశీరెడ్డినాయన ఆరాధన

కొలిమిగుండ్ల: స్థానిక నాయినపల్లె రోడ్డులోని కాశీరెడ్డినాయన ఆలయంలో శనివారం పేరం బయపురెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆరాధనోత్సవాలు నిర్వహించారు. వేదపండితులు ఆలూరి నరసింహప్రసాద్, మహేష్ స్వామికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పేరం నందకిషోర్ రెడ్డి పాల్గొన్నారు.



ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు





డోన్: ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి, సంజామల: బాబాను దర్శించుకుంటున్న ఎంపీపీ, భక్తులు

దత్త జయంతి ఉత్సవాలు

డోన్: పట్టణ శివారులోని దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త జయంతి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. రెండో రోజు శనివారం ఆధ్యాత్మిక ప్రవచనాలు, భజనలు, సంగీత, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పూజలు చేశారు. 16న వసంతోత్సవం, అదే రోజు సాయంత్రం పల్లకీ సేవ ఉంటుందన్నారు.

- **బనగానపల్లె రూరల్:** అవుకు రోడ్డులోని ఎస్ఆర్‌బీసీ కాలనీలో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయంలో దత్తజయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం కాగడహారతి, పాలాభిషేకం, గురు చరిత్ర పారాయణం, మధ్యాహ్న హారతి, సాయంత్రం పల్లకీసేవ, సత్సంగం, శేజ్ హారతి తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.
- **బేతంచెర్ల:** కర్నూలు రహదారిలోని షిర్డీ సాయి మందిరంలో దత్తాత్రేయస్వామికి ఓంకార ప్రనవం, మందిర సంకీర్తన, కాగడ హారతి, అభిషేకాలు, మహామంగళహారతి, ప్రత్యేక పుష్పాలంకరణ, సాముహిక వ్రతం నిర్వహించారు. కృపాధామ్ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు.



బేతంచెర్ల: ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి

- **సంజామల:** అవుకులో గురుదత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ చేసి హారతులు సమర్పించారు. ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి, చల్లా రఘునాథ్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి పూజలు చేశారు.

డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు

కోవెలకుంట్ల: తమిళనాడు రాష్ట్రానికి చెందిన కారు డ్రైవర్‌పై శనివారం డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. తిరువళ్లూరుకు చెందిన సందీప్ మద్యం సేవించి నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తుండడంతో వాహనాన్ని నిలిపి వేశామన్నారు. మద్యం తాగినట్లు తేలడంతో డ్రైవర్‌పై డ్రంకన్ డ్రైవ్, వాహనంలో ఉన్న మరో ఇద్దరిపై ఓపెన్ డ్రింకింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

17న ప్యాపిలిలో జాబ్‌మేళా

ప్యాపిలి: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 17న స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి శ్రీకాంత్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమా, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ధృవీకరణ పత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 95426 43747, 79812 38237 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య





డోన్: సీఐకి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు, బనగానపల్లె: తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విలేకరులు

డోన్: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం వేములలో విధి నిర్వహణలో ఉన్న సాక్షి రిపోర్టర్లపై టీడీపీ నేతలు దాడి చేయడం హేయమైన చర్య అని డోన్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నాయకులు అన్నారు. శనివారం డోన్‌లో ర్యాలీ నిర్వహించారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్పీ కార్యాలయంలో సీఐ ఇంతియాజ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులు వడ్డె నాగరాజు, శేఖర్, జర్మియా, ఖాదర్, శేఖర్ రెడ్డి, నైజాం రాజు, మణిధర్, మోహన్, ఆచారి, కాశీం, జీవన్, శివానంద పాల్గొన్నారు.

బనగానపల్లె: జర్నలిస్టులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ మద్దయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు గుండం సర్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. పులివెందుల నియోజకవర్గం వేములలో సాగునీటి సంఘాల ఎన్నికల కవరేజ్ నిమిత్తం వెళ్లిన సాక్షి కరస్పాండెంట్ శ్రీనివాసులు, కెమెరామెన్ రాము, రిపోర్టర్ రాజారెడ్డిలపై కూటమి నాయకులు దాడికి పాల్పడడం దారుణమన్నారు. అలాగే హైదరాబాద్‌లో సినీ నటుడు మోహన్ బాబు విలేకరిపై దాడి చేయడాన్ని ఖండించారు. విలేకరులు రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, చంద్రశేఖర్, బాలచెన్నయ్య, రఘురామిరెడ్డి, మధు, రాజేష్, వెంకటేశ్వర్లు, వెంకటరాముడు, నాగేష్, సుబ్బయ్య, వేణుగోపాల్‌రెడ్డి, బాలయ్య, సాగర్ పాల్గొన్నారు.



బేతంచెర్లలో తహసీల్దార్ ప్రకాశ్‌బాబుకు..

బేతంచెర్ల: పట్టణంలో జర్నలిస్టు సంఘాల నాయకులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రకాశ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. వెంకటేశ్వరగౌడు, నాగ మధు, బండ రాముడు, సుబ్బరాయుడు, నాగరాజు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సమాజ సేవ పౌరుల బాధ్యత

- డీఎస్పీ శ్రీనివాసులు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

డోన్ టౌన్: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. స్ఫూర్తి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం యు.కొత్తపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కర్నూలుకు చెందిన శాంతిరామ్ ఐ హాస్పిటల్ వైద్యులు కొత్తపల్లె, సీసంగుంతల, ఉంగరానిగుండ్ల, మల్యాల గ్రామాల నుంచి వచ్చిన 210 మందికి కంటి పరీక్షలు చేశారు. 50 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. వీరిని కర్నూలుకు తరలించి శస్త్ర చికిత్స చేయించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు ఆలా మధు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీని గ్రామస్తులు సత్కరించారు. మిన్నల హుస్సేన్, చిన్నమద్ది, రామిరెడ్డి, రసూల్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.